జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## భద్రాద్రి కొత్తగూడెం
శనివారం | 10 | అక్టోబర్ | 2026 ◆ పేజీలు : 9



## రోడ్ల పనుల్లో నాణ్యత తప్పనిసరి

ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలి...

- రహదారుల అభివృద్ధిపై అధికారులతో ముఖ్య సమావేశం...
- పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు...



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి. అక్టోబర్ 9, ప్రజాజ్యోతి.** నియోజకవర్గంలోని రోడ్ల పనుల్లో నాణ్యత తప్పనిసరిగా ఉండాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. శుక్రవారం బూర్గంపాడు మండల కేంద్రంలో ఆర్అండ్బీ శాఖ అధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్షా

మిగతా 2 లో...

- ఐదు నియోజకవర్గాల్లో ఏకంగా 1.32 లక్షల ఓట్ల తొలగింపు..
- సుమారు 2.40 లక్షల మందికి నోటీసులు
- వలసలు, గైర్హాజరు పేరిట భారీ కోత..
- అర్హులైన ఓటర్ల పరిస్థితిపై రాజకీయ దుమారం..




9 లో..

# భద్రాద్రి ఓటర్ల జాబితాలో 'లక్ష'ణమైన షాక్!



# తాటి నెక్ట్స్ వ్యూహం ఏంటి..?

- గులాబీలోనే ఉంటారా ? పవన్ పార్టీలోకి జంపావుతారా..?
- వాట్సాప్ లో పేరు లేదని.. స్టేజీపై ఇంత రచ్చనా..!
- ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో తెలియదు..!
- ఏ పార్టీలో ఉన్నా అదే తంతు.. అదే వివాదం.. తాటి తీరే అంత..!
- తాటి నుంచి కొత్త రాగం..!

6 లో..

- కొత్తగూడెంలో యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘనలు!
- ఫిర్యాదులొచ్చినా పట్టించుకోరా? అధికారుల మౌనం వెనుక మర్మమేంటి?
- ఎంజీ రోడ్డుపై ఫుట్‌పాత్, డ్రైనేజీపైనే భవన నిర్మాణం!
- మౌఖిక హెచ్చరికలతోనే కాలయాపన చేస్తున్న కార్పొరేషన్ అధికారులు



(ఫైల్ ఫోటో)

2 లో..

# టౌన్ ప్లానింగ్ నిద్రనటిస్తోందా?

- కొత్తగూడెంలో యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘనలు!
- ఫిర్యాదులొచ్చినా పట్టించుకోరా? అధికారుల మౌనం వెనుక మర్మమేంటి?
- ఎంజీ రోడ్డుపై ఫుట్‌పాత్, డ్రైనేజీపైనే భవన నిర్మాణం!
- మౌఖిక హెచ్చరికల తోనే కాలయాపన చేస్తున్న కార్పొరేషన్ అధికారులు


(ఫైల్ ఫోటో)

# టౌన్ ప్లానింగ్ నిద్ర నటిస్తోందా?

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, అక్టోబర్ 9, ప్రజాజ్యోతి ;** కొత్తగూడెం పట్టణంలో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాల్సిన పట్టణ ప్రణాళికా విభాగం (టౌన్ ప్లానింగ్) అసలు ఉందో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. కంటి ముందే నిబంధనల ఉల్లంఘనలు జరుగుతున్నా, ప్రజా స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నా అధికారులు నిద్ర నటిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానికుల నుంచి వరుసగా ఫిర్యాదులు వెళ్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అక్రమ కట్టడాలు యథేచ్ఛగా సాగుతుండటం వెనుక అధికారుల మౌనానికి మర్మమేమిటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఎంజీ రోడ్డులో ప్రస్తుతం సాగుతున్న ఒక భవన నిర్మాణ వ్యవహారం కార్పొరేషన్ అధికారుల తీరును, పర్యవేక్షణా రాహిత్యాన్ని బట్టబయలు చేస్తోంది.

**ఆక్రమణల ఉచ్చులో 'ఎంజీ రోడ్డు'**

కొత్తగూడెం పట్టణానికి గుండెకాయ లాంటి ఎంజీ రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా ఓ భవన నిర్మాణం సాగుతున్నట్లు తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి.

భవన యజమాని నిబంధనల ప్రకారం కేటాయించాల్సిన సెట్‌బ్యాక్‌ను పూర్తిగా పక్కనబెట్టి, ఫుట్‌పాత్ పరిధిని దాటి సుమారు రెండడుగుల మేర ముందుకు వచ్చి నిర్మాణం చేపడుతుండటం గమనార్హం. అంతేకాకుండా, పట్టణ పారిశుధ్యానికి అత్యంత కీలకమైన ప్రధాన మురుగునీటి కాలువ (డ్రైనేజీ) భాగంపైనే ఈ నిర్మాణం లేవడం స్థానికులను విస్మయానికి గురిచేస్తోంది. పాదచారుల భద్రతను గాలికి వదిలేసి, రేపటి రోజున కాలువ పూడికతీత పనులకు ఆటంకం కలిగేలా నిర్మాణం చేపడుతుంటే అధికారులు ఏం చేస్తున్నారనే ఆగ్రహం వ్యక్తమవుతోంది.

**మౌఖిక హెచ్చరికలకే పరిమితం!**

ఈ అక్రమ నిర్మాణంపై స్థానికులు, బాధితులు కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో టౌన్ ప్లానింగ్ అధికారి, సిబ్బంది అక్కడికి చేరుకుని పరిశీలించారు. నిబంధనల ఉల్లంఘన నిజమేనని గుర్తించి నిర్మాణాన్ని నిలిపివేయాలని మౌఖికంగా చెప్పి వెళ్లిపోయారే తప్ప, క్షేత్రస్థాయిలో పనులను అడ్డుకునేలా లిఖితపూర్వక నోటీసులు ఇవ్వడం గానీ, కట్టడాన్ని తొలగించడం గానీ చేయలేదనే విమర్శలు ఉన్నాయి. అధికారులు వచ్చి కేవలం మాటవరసకే హెచ్చరించి వెళ్తుండటంతో, భవన యజమాని ఏమాత్రం లెక్కచేయకుండా పనులు కొనసాగిస్తున్నారని, ఈ మౌఖిక నాటకాల వెనుక అంతర్యం ఏమిటో అర్థం కావడం లేదని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**సెట్‌బ్యాక్ నిబంధనలు ఇలా..**

వాణిజ్య సముదాయాల నిర్మాణానికి మున్సిపల్ చట్టం ప్రకారం కచ్చితమైన సెట్‌బ్యాక్ నిబంధనలు ఉంటాయి. భవన నిర్మాణంలో స్థల సరిహద్దు లేదా రహదారి సరిహద్దు నుంచి ఖాళీగా వదలాల్సిన స్థలాన్నే 'సెట్‌బ్యాక్' అంటారు. స్థల విస్తీర్ణం, రోడ్డు వెడల్పు, భవనం ఎత్తు ఆధారంగా ఎంత స్థలం వదలాలో ప్లాన్‌లో స్పష్టంగా పేర్కొంటారు. సొంత స్థలంలో సెట్‌బ్యాక్ వదలకుపోవడం ఒక ఉల్లంఘన అయితే, ఫుట్‌పాత్ లేదా మురుగునీటి డ్రైనేజీ లాంటి ప్రజా స్థలాలను ఆక్రమించి నిర్మించడం తీవ్రమైన చట్టవిరుద్ధమైన నేరం. అల్లాంటి నిర్మాణాలను నితిసులు ఇవ్వకుండానే కుల్చేసే అధికారం కార్పోరేషన్ అధికారులకి ఉంటుది.

ఈ నేపథ్యంలో ఎంజీ రోడ్డు నిర్మాణంలో మంజూరైన ప్లాన్ ప్రకారం ఎంత స్థలం చూపించారు,

వాస్తవంగా ఎంత వదిలారు, ఫుట్‌పాత్ మరియు కాలువ స్థలాలను ఆక్రమించారా లేదా అన్న విషయాలను టౌన్ ప్లానింగ్ అధికారులు పక్కాగా కొలతలు తీసి బహిర్గతం చేయాల్సిన అవసరం ఉంది. కేవలం పరిశీలనలు, మాటల హెచ్చరికల పేరుతో కాలయాపన చేయకుండా, ఇటువంటి ఆక్రమణలను మున్సిపల్ చట్టం ప్రకారం తక్షణమే అడ్డుకుని, కూల్చివేసే పూర్తి అధికారాన్ని ఉపయోగించి అక్రమ కట్టడాన్ని నేలమట్టం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**కచ్చితంగా కూల్చివేస్తాం ; జి. నవీన్ కుమార్ (టీపీఓ)**

"ఎంజీ రోడ్డులోని భవన నిర్మాణంలో నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు మా దృష్టికి వచ్చింది. ఈ విషయంలో స్పష్టంగా చెబుతున్నాం.. సదరు నిర్మాణదారులు నిబంధనలకు విరుద్ధంగా ఎంతైతే ముందుకు వచ్చారో, ముఖ్యంగా మురుగునీటి డ్రైనేజీపై ఏ భాగమైతే నిర్మించారో ఆ ఆక్రమణ భాగాన్ని కచ్చితంగా కూల్చివేస్తాం. అందులో ఎలాంటి సందేహం లేదు. భవన యజమాని కచ్చితంగా సెట్‌బ్యాక్ పాటించి తీరాల్సిందే. అనుమతులు లేవని లేదా ప్లాన్ ఉల్లంఘించారని తేలితే నూతన మున్సిపల్ చట్టం ప్రకారం ఎలాంటి జాలి దయా లేకుండా చర్యలు తీసుకుంటాం. డ్రైనేజీ పైన ఉన్న నిర్మాణాన్ని తొలగించి, సెట్‌బ్యాక్ పక్కాగా ఉండేలా చూస్తాం."

## రోడ్ల పనుల్లో నాణ్యత తప్పనిసరి



(మొదటి పేజీ తరువాయి...)

సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా చేపట్టిన రోడ్ల మరమ్మతులు, అభివృద్ధి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ లో ఉన్న నూతన రహదారుల నిర్మాణ ప్రతిపాదనలపై ఆరా తీశారు. గ్రామాల మధ్య అనుసంధాన రహదారుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సూచించారు.రహదారుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడవద్దని అధికారులను హెచ్చరించారు. నిర్ణీత గడువులోగా పనులన్నీ పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. కాంట్రాక్టర్లు అలసత్వం వహిస్తే చర్యలు తీసుకోవాలని చెప్పారు. వర్షాకాలం దృష్ట్యా దెబ్బతిన్న రోడ్లకు తక్షణ మరమ్మతులు చేపట్టాలని అన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రహదారులు బాగుంటేనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. రైతులు తమ పంటలను మార్కెట్ కు తరలించేందుకు రోడ్లు ఎంతో అవసరమని గుర్తుచేశారు. విద్యార్థులు, రోగులు ఇబ్బంది పడకుండా రోడ్లను అభివృద్ధి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రూప్లా తండా ఎంపీపీ ఎస్ స్కూల్లో

# వైభవంగా బతుకమ్మ సంబరాలు

- తీరొక్క పూలతో బతుకమ్మల అలంకరణ
- ఆటపాటలు, బతుకమ్మ పాటలతో మహిళల సందడి
- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా వేడుకలు



**సుజాతనగర్, అక్టోబర్ 9 (ప్రజాజ్యోతి ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలం రూప్లా తండా గ్రామంలో బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని గ్రామంలో మహిళలు, యువతులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి పండుగ సందడిని నెలకొల్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం బీ. భావుసింగ్ స్వచ్ఛంద వాలంటీరు, హెడ్మాస్టర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఈ వేడుకను ఉత్సాహంగా జరుపుకుంటున్నారు , ఆటపాటలతో సందడి చేస్తూ సంప్రదాయబద్ధంగా వేడుకలను జరుపుకుంటున్నారు. పూలతో అలంకరించిన బతుకమ్మలు, మహిళల కోలాహలంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ గ్రామీణ సంస్కృతికి అద్దం పడుతోంది. ప్రస్తుత విద్యా విధానంలో విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన ఎంత ముఖ్యమో, మన మూలాలు, సంస్కృతి, సంప్రదాయాల గురించి తెలియజేయడం కూడా అంతే ముఖ్యమనే ఉద్దేశంతో పాఠశాల యాజమాన్యం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. పండుగల వెనుక ఉన్న సాంస్కృతిక ప్రాధాన్యతను విద్యార్థులకు ఆచరణాత్మకంగా పరిచయం చేయడం ద్వారా మన సంప్రదాయాల పట్ల గౌరవం, పెద్దల పట్ల మర్యాద, సమాజంలో ఐకమత్య భావన పెంపొందించవచ్చనే లక్ష్యంతో వేడుకలను చేపట్టారు. పుస్తకాల్లో చదివే విషయాలకే పరిమితం కాకుండా, మన పండుగలను ప్రత్యక్షంగా అనుభవించడం ద్వారా విద్యార్థులు తమ సంస్కృతిని మరింత సులభంగా అర్థం చేసుకుంటారని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. చిన్నతనం నుంచే తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పిస్తే భవిష్యత్తు తరాలు వాటి విలువలను గుర్తించి, వాటిని పరిరక్షించే బాధ్యతను స్వీకరిస్తాయని పాఠశాల యాజమాన్యం భావించింది. ఈ యొక్క కార్యక్రమంలో గ్రామ ఆడపడుచులు పాఠశాల బృందం పాఠశాలలో చదివే పిల్లలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు



# ఐదేళ్లుగా నివాసం.. ఇంకా అందని అర్హత గుర్తింపు!

- దుగినేపల్లి డబుల్ బెడ్ రూం ఇళ్ల నివాసితులకు న్యాయం చేయాలి
- విద్యుత్, తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలి
- ఎంఆర్ఓ, ఎంపీడీఓలకు నివాసితుల దరఖాస్తులు
- నిరుపేద గిరిజనులకు ఇళ్లను కేటాయించాలని బీజేపీ మండల అధ్యక్షుడు ధూళిపూడి శివప్రసాద్ డిమాండ్



**పినపాక,అక్టోబర్ 09(ప్రజాజ్యోతి)** పినపాక మండలం దుగినేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్టీ కాలనీలో ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్లలో గత ఐదేళ్లుగా నివాసం ఉంటున్న నిరుపేద గిరిజనులకు న్యాయం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు ధూళిపూడి శివప్రసాద్ డిమాండ్ చేశారు. తమకు నివాసం ఉంటున్న ఇళ్లను కేటాయించి, అర్హులుగా గుర్తించాలని కోరుతూ సదరు ఇళ్ల నివాసితులు ఎంఆర్ఓ, ఎంపీడీఓలకు దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శివప్రసాద్ వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

### ›› ఐదేళ్లుగా నివాసం.. అయినా గుర్తింపు ఏదీ?

దుగినేపల్లిలో నిర్మించిన 40 డబుల్ బెడ్ రూం ఇళ్లలో నిరుపేద గిరిజన కుటుంబాలు గత ఐదేళ్లుగా నివాసం ఉంటున్నాయని శివప్రసాద్ తెలిపారు. సొంత ఇళ్లు లేని పేద కుటుంబాలు ఈ ఇళ్లలో చిన్నచిన్న మరమ్మతులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాయని పేర్కొన్నారు. ఇన్నేళ్లుగా అక్కడే ఉంటున్నప్పటికీ, వారికి ఇళ్ల కేటాయింపుపై స్పష్టత లేకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు.

### ›› విద్యుత్, తాగునీటి సమస్యలు పరిష్కరించాలి

ఇళ్లలో నివసిస్తున్న కుటుంబాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం, తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయనే విషయాన్ని శివప్రసాద్ ప్రస్తావించారు. నిరుపేద కుటుంబాలు కనీస వసతులు లేక ఇబ్బందులు పడకుండా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. విద్యుత్, తాగునీటి సరఫరాకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

### ›› అర్హులను గుర్తించి ఇళ్లు కేటాయించాలి

సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, ఇళ్లలో నివసిస్తున్న నిరుపేద గిరిజన కుటుంబాల అర్హతలను నిర్ధారించాలని శివప్రసాద్ కోరారు. నిబంధనల ప్రకారం అర్హులైన వారికి డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఇళ్లకు ఇంటి పన్ను చెల్లించే విధంగా అవసరమైన ప్రక్రియను చేపట్టి, నివాసితులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను కోరారు.ఏళ్ల తరబడి సొంత ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్న నిరుపేద గిరిజన కుటుంబాల సమస్యను అధికారులు మానవతా దృక్పథంతో పరిశీలించి,నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

# జీపీ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలుకు కృషి

- ఏళ్లు గడుస్తున్నా ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాల కల్పించకపోవడం సిగ్గుచేటు
- కార్మికులకు నష్టం కలిగించే జీవో 51 రద్దుకు అసెంబ్లీలో ప్రస్తావిస్తా
- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**కొత్తగూడెం కలెక్టరేట్ ,పాల్వంచ / అక్టోబర్ 9 ,(ప్రజా జ్యోతి)** గ్రామ పంచాయతీల్లో నిరంతరం సేవలందిస్తున్న కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హామీ ఇచ్చారు. పాల్వంచ పట్టణంలోని సీఆర్ భవన్‌లో శుక్రవారం ఏఐటీయూసీ అనుబంధ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ పాల్వంచ మండల స్థాయి మహాసభ జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని, పని భద్రత కల్పించాలని, అదేవిధంగా జీవో నంబర్ 60 ప్రకారం వేతనాలు అమలు చేయాలని కార్మికులు కోరుతున్నారన్నారు, కార్మికులకు నష్టం కలిగించే జీవో నంబర్ 51 రద్దు అంశంపై అసెంబ్లీలో ప్రస్తావిస్తానని చెప్పారు. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించడం, ఉద్యోగ భద్రతతో పాటు రూ.10 లక్షల ఇన్సూరెన్స్ భరోసా, యూనిఫాంలు, శానిటైజర్ కిట్లు అందించేలా సంబంధిత శాఖ మంత్రి, ఉన్నతాధికారులతో చర్చిస్తానని తెలిపారు. సొంత ఇల్లు లేని అర్హులైన పంచాయతీ కార్మికులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరుకు ప్రత్యేక కేటాయింపు జరిగేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తానని ఆయన స్పష్టం చేశారు. కార్మికులు ఎదుర్కొంటున్న ప్రతీ సమస్యను పరిష్కరించేందుకు తనవంతుగా పూర్తిస్థాయిలో ప్రయత్నిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్, బికేయంయు జిల్లా అధ్యక్షులు వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఎఐటియుసి జిల్లా నాయకులు యూసుఫ్, అన్నారపు వెంకటేశ్వర్లు నిమ్మల రాంబాబు ఇట్టి వెంకట్రావు, యూనియన్ నాయకులు లంబా నాయక్, బాలకృష్ణ, శ్రీనివాస్, రామకృష్ణ, శ్రీను, లెనిన్, మమత, వినయ్, రామనాథం, రవి, దుర్గా, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# యంఆర్జి నారాయణ స్కూల్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

- సంప్రదాయ దుస్తుల్లో అలరించిన విద్యార్థినులు
- పూల పండుగ విశిష్టతను చాటిన చిన్నారులు





**ఇల్లందు, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి)** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకోని శుక్రవారం పట్టణంలోని యంఆర్జి నారాయణ స్కూల్‌లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో వేడుకల్లో పాల్గొన్నారు. పూల పండుగ ప్రత్యేకతను ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ కార్యక్రమం ఆహ్లాదకరంగా సాగింది. ఈ సందర్భంగా విద్యార్థినులు బతుకమ్మ పాటలు పాడుతూ, బతుకమ్మల చుట్టూ సంప్రదాయబద్ధంగా ఆడిపాడారు. పసుపు, ఎరుపు, తెలుపు తదితర రంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు పాఠశాల ప్రాంగణానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను విద్యార్థులు తెలుసుకునేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఒంగూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయడంలో ఇలాంటి వేడుకలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. తమ పాఠశాల ఆధ్వర్యంలో ప్రతి పండుగను చిన్నారుల సమక్షంలో ఎంతో ఘనంగా జరుపుకోవడం ఆనవయతిగా వస్తుందని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.సంప్రదాయాల పరిరక్షణ, సాంస్కృతిక విలువల పట్ల గౌరవాన్ని పెంపొందించేలా బతుకమ్మ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. విద్యార్థినుల సందడి, రంగురంగుల బతుకమ్మలతో పాఠశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆకాంక్ష, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు సురేష్, రుబీనా, రేష్మ, సౌందర్య, రహిమా, పద్మ, అయేషా, ఆర్తి, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# యాదవ హక్కుల పోరాట సమితి భద్రాచలం పట్టణ కమిటీ ఎన్నిక

- అధ్యక్షుడిగా కాసిబోయిన మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా జెట్టి తులసీకృష్ణ



**భద్రాచలం, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి భద్రాచలం పట్టణ నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గోదావరి ఇన్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా అధ్యక్షుడు జెట్టి రామకృష్ణ యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.నూతన పట్టణ అధ్యక్షుడిగా కాసిబోయిన మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా జెట్టి తులసీకృష్ణ, గౌరవ అధ్యక్షుడిగా జెమ్మి నాగసుబ్రహ్మణ్యం ఎన్నికయ్యారు. కోశాధికారిగా మొగిలి కనకరాజు, ఉపాధ్యక్షులుగా నక్క సాయిరాం, గాలి అచ్యుత్, సంయుక్త కార్యదర్శిగా జక్కుల శ్రీరామ్ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా మేకల రాములు యాదవ్ మాట్లాడుతూ యాదవులు విద్య, రాజకీయ రంగాల్లో అభివృద్ధి సాధించాలని, సమాజంలో విద్యపై చైతన్యం కల్పించాలని పిలుపునిచ్చారు. యాదవుల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి ఐక్యంగా కృషి చేయాలని సూచించారు.నూతన కమిటీ నాయకులు మాట్లాడుతూ తమపై ఉంచిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పట్టణంలోని యాదవుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు, కార్యకర్తలు, నూతన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# గిరిజన విద్యాసంస్థల్లో ఉచిత కంటి పరీక్షలు

- 95 విద్యాసంస్థల్లో 25 వేల మంది విద్యార్థులకు ప్రయోజనం
- ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కార్యక్రమం




**భద్రాచలం, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** గిరిజన విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా భద్రాద్రి జిల్లాలో ఉచిత కంటి పరీక్షలు, కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం భద్రాచలం గిరిజన గురుకుల కళాశాలలో ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ అంకిత్, ఐటీడీఏ పీవో బి. రాహుల్ సహకారంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు.తొలి దశలో 95 గిరిజన విద్యాసంస్థల్లో 25 వేల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు అందించనున్నట్లు రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ ఎస్.ఎల్. కాంతారావు, వైస్ చైర్మన్ చల్లగుళ్ల నాగేశ్వరరావు తెలిపారు. రెండో దశలో సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ కళాశాలల్లోనూ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. తొలి శిబిరంలో ఖమ్మం మ్యాక్సివిజన్ సాంకేతిక బృందం సహకారంతో 300 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు.

### ›› పాల్వంచలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు చేయాలి

క్యాన్సర్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో పాల్వంచలో ప్రభుత్వం కేటాయించిన 25 సెంట్ల స్థలంలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని రెడ్ క్రాస్ ప్రతినిధులు కోరారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి. సుమలత, వైస్ ప్రిన్సిపాల్ పుణ్యవతి, రెడ్ క్రాస్ ప్రతినిధులు టి.వి. బాలయోగి, వై. సూర్యనారాయణ, యడవెల్లి కృష్ణ, అవులూరి సత్యనారాయణ, బిబిజి తిలక్, పల్లంటి దేశప్ప, కంభంపాటి రవి, కండెలవాల సతీష్, ఆదినారాయణ పాల్గొన్నారు.

## ఘనంగా బీఆర్ఎస్ నేత రావులపల్లి రాంప్రసాద్ జన్మదిన వేడుకలు

- నాయకులు, కార్యకర్తల మధ్య వేడుకలు



**భద్రాచలం, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** భద్రాచలం బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావులపల్లి రాంప్రసాద్ జన్మదిన వేడుకలను శుక్రవారం పట్టణంలోని తెలంగాణ టూరిజం హరిత హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. మండల బీఆర్ఎస్ నాయకుడు ఆకోజు సునీల్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.ఆకోజు సునీల్ కుమార్ మాట్లాడుతూ, ప్రజా సేవే లక్ష్యంగా రాంప్రసాద్ ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, బడుగు బలహీన వర్గాల సంక్షేమం, ప్రజల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ ఆయన చేస్తున్న కృషి పార్టీ శ్రేణులకు స్ఫూర్తిదాయకమన్నారు.భద్రాచలం ప్రాంత అభివృద్ధి, స్థానిక సమస్యల పరిష్కారం కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కేక్ కట్ చేసి రాంప్రసాద్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## బాలికల వసతి గృహంలో పూల పండగ బతుకమ్మ

- ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నా విద్యార్థినులు





**భద్రాచలం, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** భద్రాచలంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం (బి)లో శుక్రవారం బతుకమ్మ వేడుకలు ఉత్సాహభరితంగా జరిగాయి. విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, ప్రత్యేకంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ ఆటపాటలతో సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. విద్యార్థినుల కోలాహలంతో వసతి గృహంలో పండుగ వాతావరణం నెలకొంది. సంక్షేమ అధికారి పి. స్వరాజ్యం పాల్గొనగా, వసతి గృహ విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# మాజీ ఎంపీ అయినా సామాన్యుడే..!

- ఆర్టీసీ బస్సులో మిడియం బాబూరావు ప్రయాణం
- హంగూ ఆర్భాటం లేకుండా.. ప్రజల్లో ఒకడిలా బస్సు ప్రయాణం
- పలువురికి ఆదర్శంగా నిలిచినా మాజీ ఎంపీ
- పదవి లేకపోయినా ఒదిగి ఉన్న నాయకుడు
- నిరాడంబరతకు నిలువెత్తు నిదర్శనం





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి, అక్టోబర్ 9, ప్రజాజ్యోతి**

హోదా, అధికారం శాశ్వతం కాదు, ప్రజలతో ఉండడమే నాయకుడి నిజమైన గుణం అని నిరూపించారు మాజీ ఎంపీ మిడియం బాబూరావు. శుక్రవారం మణుగూరు ఆర్టీసీ బస్టాండ్ లో సాధారణ ప్రయాణికుల మధ్య సామాన్యుడిలా కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఎలాంటి కారు, అనుచరగణం లేకుండా ప్రజలతో కలిసి ఆర్టీసీ బస్సు ఎక్కి ప్రయాణించారు. మాజీ ఎంపీ స్థాయి వ్యక్తి అయినప్పటికీ ఎలాంటి హంగూ ఆర్భాటాలు ప్రదర్శించకుండా టికెట్ తీసుకుని బస్సు లో కూర్చోవడం అక్కడి ప్రయాణికుల ను ఆకట్టుకుంది. తన పక్కన కూర్చు న్న వారితో సరదాగా మాట్లాడుతూ, యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటూ ప్రయాణాన్ని కొనసాగించారు. ఈ దృశ్యాన్ని చూసిన పలువురు ఫోన్లలో ఫోటోలు తీసుకున్నారు. కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా ఎప్పుడూ ప్రజల్లో ఉండే మిడియం బాబూరావు, పదవులు ఉన్న , లేకపోయినా తన నైజం మార్చుకోలేదని స్థానికులు ప్రశంసించారు. నేటి రాజకీయాల్లో కార్పొరేటర్ కూడా కా రు లేకుండా తిరగని పరిస్థితిలో ఉంటే, మాజీ ఎంపీ ఇలా బస్సు లో తిరగడం నిజంగా అభినందనీయమని అంటున్నారు. పదవులు మారినా ప్రజలతో ఉన్న అనుబంధం ఎప్పటికీ మారకూడదనే బలమైన సందేశాన్ని ఈ ప్ర యాణం ద్వారా సమాజానికి చాటిచెప్పారు. నాయకుడు అంటే ప్రజల్లో ఒకడిగా ఉండాలనే కమ్యూనిస్టు సిద్ధాంతానికి ఆయన నిలువెత్తు నిదర్శనంగా నిలిచారని పలువురు అభిప్రాయపడుతున్నారు

## టీబీ నిర్మూలనకు వైద్య శిబిరం



**చర్ల, అక్టోబర్ 09(ప్రజా జ్యోతి):** క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా చర్ల మండలం ఉప్పరిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో డాక్టర్ .హారిక ఆధ్వర్యంలో టీబీ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రజల్లో క్షయ వ్యాధిపై అవగాహన కల్పించడంతో పాటు, వ్యాధి లక్షణాలు ఉన్నవారిని ముందుగానే గుర్తించి సకాలంలో చికిత్స అందించడమే లక్ష్యంగా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. టీబీ అనుమానితులను గుర్తించేందుకు ఛాతీ ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ .హారిక మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, రాత్రి పూట చెమటలు పట్టడం, ఆకలి మందగించడం, శరీర బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆరోగ్య సిబ్బంది సూచించారు. క్షయ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి వైద్యుల సూచనల మేరకు పూర్తిస్థాయిలో చికిత్స తీసుకుంటే నయం చేయవచ్చని తెలిపారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో టీబీ నిర్ధారణ పరీక్షలు, చికిత్స సేవలు అందుబాటులో ఉన్నాయని అన్నారు.టీబీ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, వ్యాధి లక్షణాలు ఉన్నవారు ముందుకు వచ్చి పరీక్షలు చేయించుకోవాలని ఆరోగ్య సిబ్బంది పిలుపునిచ్చారు. డాక్టర్ .హారిక , ఉప్పరిగూడెం స ర్పంచ్ నాగలక్షి , గోపీ, ధర్మ, ఎంఎల్‌హెచ్‌పీ గీత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు







**చర్ల, అక్టోబర్ 09 (ప్రజా జ్యోతి):** చర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (డీఐఈఓ), నోడల్ అధికారి హెచ్. వెంకటేశ్వర రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. నరేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు చదువు, క్రమశిక్షణ, భవిష్యత్తు లక్ష్యాలపై అతిథులు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా హెచ్. వెంకటేశ్వర రావు మాట్లాడుతూ విద్యార్థులు ఇప్పటి నుంచే వార్షిక పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని, కృత్రిమ మేధ (ఏఐ)ను సద్వినియోగం చేసుకుంటూ తమ విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు ప్రతిరోజూ కళాశాలకు తప్పనిసరిగా హాజరై, చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు.మరో ముఖ్య అతిథి, చర్ల ఎంపీడీవో ఈదయ్య మాట్లాడుతూ చర్ల మండలానికి చెందిన పలువురు ప్రముఖులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకున్నారని గుర్తుచేశారు. వారిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, భవిష్యత్తులో తమ ప్రతిభతో చర్ల మండలానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. నరేందర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుపట్ల సరైన ప్రణాళికను అనుసరించాలని, క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని అలవర్చుకుని విద్యలో రాణించాలని సూచించారు.అనంతరం కళాశాల విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను విశేషంగా అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## నారాయణ పాఠశాలలో ఘనంగా ముందస్తు బతుకమ్మ, దసరా సంబరాలు

**కొత్తగూడెం కలెక్టరేట్, పాల్వంచ / అక్టోబర్ 9, (ప్రజా జ్యోతి )** పాల్వంచలోని స్థానిక నారాయణ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ, దసరా సంబరాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు, ఈ వేడుకలు పాఠశాలఖమ్మం జోన్ ఏజీఎం రాంకీ ఆధ్వర్యంలో పాఠశాల ప్రిన్సిపాల్ పూరేటి నరసింహారావు నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంప్రదాయ దుస్తులతో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు, దీంతో పాఠశాల ఆవరణ పండగ వాతావరణాన్ని సంతరించుకుంది, అదేవిధంగా ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని పాఠశాల విద్యార్థులను అభినందించారు, ఈ సందర్భంగా ఖమ్మం జోన్ ఏజీఎం రాంకీ మాట్లాడుతూ, పండుగలు కేవలం ఆనందానికే పరిమితం కాకుండా మన సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువలను భావితరాలకు అందించే గొప్ప అవకాశాలని పేర్కొన్నారు. చెడుపై మంచి సాధించిన విజయదశమి స్ఫూర్తితో ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, మానవీయ విలువలు, బాధ్యతాయుత ప్రవర్తనను అలవర్చుకోవాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు సోషల్ మీడియాను విద్యాభ్యాసానికి, జ్ఞానాభివృద్ధికి ఉపయోగించుకోవాలని, దాని దుర్వినియోగానికి దూరంగా ఉండాలని అన్నారు, అమ్మవారి ఆశీస్సులతో ప్రతి ఒక్కరికీ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు కలగాలని ఆకాంక్షించారు. అనంతరంపాఠశాల



ప్రిన్సిపాల్ పూరేటి నరసింహారావు మాట్లాడుతూ, నేటి సమాజంలో చెడు అలవాట్లను విడనాడి, సాంకేతిక పరిజ్ఞానాన్ని బాధ్యతాయుతంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి, సంప్రదాయబద్ధంగా వేడుకల్లో పాల్గొన్న అభినందనీయమన్నారు, అనంతరం విజయదశమి వేడుకల్లో భాగంగా నవరాత్రులలో అమ్మవారు తొమ్మిది రూపాల్లో పూజలందుకునే నవదుర్గల విశిష్టతను చాటుతూ విద్యార్థులు ప్రదర్శించిన కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అదేవిధంగా రావణ దహనం ప్రత్యేక ఆకర్షణ గా నిలిచింది, ఈ కార్యక్రమంలో ఆర్ఐ క్రాంతి కుమార్, ఈకిడ్జ్ కోఆర్డినేటర్ నీలిమ, ఏడి రామకృష్ణ, వైస్ ప్రిన్సిపల్స్ శైలజ, పద్మ, పీఈటీ వినయ్, ఏవో వీర తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ఎమ్మెల్యే పాయం పర్యటన

- ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం
- అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇల్లు అందించేందుకు కృషి
- సారపాకలో నూతన గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు
- రూ.1.02 కోట్లతో సైడ్‌డ్రైన్ నిర్మాణ పనులకు భూమిపూజ..
- 70 మందికి రూ.70.08 లక్షల కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



**బూర్గంపహాడ్, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని పినపాక ఎమ్మెల్యే, శాసన సభ ఎస్టీ సంక్షేమ కమిటీ ఛైర్మన్ పాయం వెంకటేశ్వర్లు అన్నారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండల పరిధిలో శుక్రవారం ఆయన పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఒకవైపు పేద కుటుంబం నూతనంగా నిర్మించుకున్న ఇందిర మ్మ ఇంటి గృహప్రవేశ వేడుకలో పా ల్గొని శుభాకాంక్షలు తెలియజేయగా, మరోవైపు సారపాకలో రూ.1.02 కో ట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సైడ్‌డ్రైన్ నిర్మాణ పనులకు భూమిపూ జ చేశారు.అనంతరం మండల రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో 70 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.

### పేదలకు సొంతింటి భరోసా.. ఇందిరమ్మ ఇళ్లతో ఆత్మగౌరవం

బూర్గంపాడు మండలం సారపాక పంచాయతీ పరిధిలోని తాళ్లగొమ్మూరులో తేజావత్ సోనా నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ వేడుకలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. నూతన గృహంలోకి అడుగుపెట్టిన సోనా కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి, వారు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద కుటుంబాలకు సొంతిల్లు కల్పించడం ద్వారా వారికి భద్రతతోపాటు ఆత్మగౌరవాన్ని అందించవచ్చన్నారు. అర్హులైన పేదలకు గృహ వసతి కల్పించాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు.మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహకారంతో అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.నియోజకవర్గంలో అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పేదల జీవితాల్లో సొంతిల్లు కొత్త భరోసాను నింపుతుందని,ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### రూ.1.02 కోట్లతో సైడ్‌డ్రైన్ నిర్మాణం

సారపాక గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా రూ. 1.02 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సైడ్‌డ్రైన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు భూమి పూజ చేశారు.గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపడేందుకు ఈ నిర్మాణ పనులు దోహదపడనున్న నేపథ్యంలో పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని అధికారులకు సూచించారు.నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని,ప్రజలకు ఉపయోగపడే మౌలిక సదుపాయాల కల్పనలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

### కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌తో పేదింట వెలుగులు

పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక చేయూత అందించడమే కళ్యాణలక్ష్మి,షాదీ ముబారక్ పథకాల ప్రధాన ఉద్దేశమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు.బూర్గంపహాడ్ మండల రైతు వేదికలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో 70 మంది లబ్ధిదారులకు ఈ పథకాల కింద చెక్కులను పంపిణీ చేశారు.ఒక్కో లబ్ధిదారునికి రూ.1,00,116 చొప్పున మొత్తం రూ.70,08,120 విలువైన చెక్కులను అందజేశారు.వివాహాల సమయంలో పేద కుటుంబాలపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ఈ పథకాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు.అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం వారి అవసరాలకు కొంతమేర అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు.ప్రజా సంక్షేమం,గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జమలారెడ్డి, ఎంపీవో రామకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఏఈ చారి, మండల హౌసింగ్ ఏఈ ఉదయ్‌కిరణ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మండల అధ్యక్షుడు పూలపల్లి సుధాకర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ మందా నాగరాజు, ఉపసర్పంచ్ గుండె వెంకన్న,తాళ్లగొమ్మూరు సర్పంచ్ కృష్ణవేణి,ఐటీసీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ చెంగల్‌రావు, జిల్లా నాయకులు,సర్పంచులు,ఉపసర్పంచులు,వార్డు సభ్యులు,మహిళా నాయకులు,కాంగ్రెస్ నాయ కులు, కార్యక ర్తలు, గ్రామ స్థులు పాల్గొన్నారు.

## పాపాల రాజ్యలక్ష్మి వైద్యానికి బిఆర్ఎస్ పార్టీ రూ.7 వేల ఆర్థిక సాయం



**పినపాక,అక్టోబర్ 09(ప్రజాజ్యోతి)** పినపాక మండలం ఏడూళ్లబయ్యారం గ్రామానికి చెందిన పాపాల రాజ్యలక్ష్మి ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో, ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు రూ.7,000 ఆర్థిక సాయాన్ని వితరణగా అందజేశారు.అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న రాజ్యలక్ష్మికి వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సహాయం అందించి తమ మానవత్వాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ పినపాక మండల అధ్యక్షుడు పగడాల సతీష్ రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు బూర రమేష్, 4వ వార్డు మెంబర్ పాపాల అలేఖ్య, పార్టీ మండల నాయకులు ముక్కు వెంకటేశ్వరరెడ్డి, బత్తుల వెంకటరెడ్డి, పోలిశెట్టి పిల్లారాయుడు, పోలిశెట్టి సత్తిబాబు, గుండు రమేష్, కోటపాటి సుబ్బారెడ్డి, కంది సుధాకర్ రెడ్డి, ముక్కు నాసర్‌రెడ్డి, పాపాల వీరబాబు, పోతునూరి సంతోష్, జక్కం నాగయ్య, నాంపల్లి తారక్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## న్యూ ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు

- రంగురంగుల పూలతో బతుకమ్మల అలంకరణ
- కోలాటాలు, ఆటపాటలతో చిన్నారుల సందడి



**అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 9, (ప్రజా జ్యోతి):** మండల కేంద్రంలో గల న్యూ ఆక్స్ ఫర్డ్ పాఠశాలలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని ముందస్తు బతుకమ్మ సంబరాల ను నిర్వహించారు. పాఠశాల యాజమాన్యం వై. విజయ భాస్కర్, కళావతి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తుండగా, ఈ సంవత్సరం కూడా ఉత్సాహంగా వేడుకలు చేపట్టారు. విద్యార్థినులు రంగురంగుల దుస్తులు ధరించి, తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి పండుగ సందడిని తీసుకొచ్చారు. బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని తెలియజేయాలనే ఉద్దేశంతో మహిళా ఉపాధ్యాయులు ప్రత్యేక ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థినులతో కలిసి ఉపాధ్యాయులు సైతం వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. పూలతో అలంకరించిన బతుకమ్మలు, చిన్నారుల కోలాటాలు, పాటలతో పాఠశాల ఆవర ణ పండుగ శోభను సంతరించుకుంది. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించడంతో పాటు ఐకమత్యం, సృజనాత్మకతను పెంచుతాయని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.

## పోషక ఆహారంపై ప్రతి కుటుంబంలో అవగాహన కలిగి ఉండాలి

- పోషణ మాసం ముగింపు కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి




**కొత్తగూడెం కలెక్టరేట్, పాల్వంచ / అక్టోబర్ 9 ,(ప్రజా జ్యోతి )** గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం పట్ల పోషక ఆహారంపై ప్రతి కుటుంబంలో అవగాహన పెంపొందించుకోవాలని కొత్తగూడెం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి అన్నారు, పాల్వంచ పట్టణ పరిధిలోని కుంటి నాగులగూడెంలో గల అంగన్వాడి కేంద్రంలో జరిగిన పోషణ ముగింపు కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు, తల్లి, బిడ్డల ఆరోగ్య పరిరక్షణకు అంగన్వాడీ కేంద్రాలు ద్వారా అందుతున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు, మహిళలు, చిన్నారుల సంక్షేమం కోసం ప్రజాప్రతినిధులు, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేయడం అభినందనీయమని అన్నారు ,అనంతరం అంగన్వాడి కేంద్రంలో ఉన్న గర్భిణీలకు శ్రీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహించారు, ఈ కార్యక్రమంలో లక్ష్మీ ప్రసన్న, సూపర్వైజర్ కవిత, ఎం విజయలక్ష్మి ,టి విజయలక్ష్మి, అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు ,ఆశా వర్కర్లు ,గర్భిణీలు బాలింతలు పాల్గొన్నారు.

## బోరు బావుల నీటి మట్టం పెంపునకు చర్యలు

- చుంచుపల్లి తండాలో బోర్‌వెల్ రీఛార్జ్, ఇంకుడు గుంతల పనులు ప్రారంభం



**చుంచుపల్లి, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండల పరిధిలోని చుంచుపల్లి తండా గ్రామంలో బోరు బావుల్లో నీటి మట్టం తగ్గిపోతుండటంతో ముందస్తు చర్యల్లో భాగంగా బోర్‌వెల్ రీఛార్జ్ గుంత, ఇంకుడు గుంతల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. భూగర్భ జలాలను సంరక్షించి, భవిష్యత్తులో నీటి కొరత తలెత్తకుండా ఉండేందుకు ఈ పనులను ప్రారంభించారు.చుంచుపల్లి తండా సర్పంచ్ వీరన్న, గ్రామ కార్యదర్శి సత్యనారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్ దేవదాసు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. వర్షపు నీటిని వృథా కాకుండా భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారా భూగర్భ జలాల నిల్వలను పెంచవచ్చని, బోరు బావుల్లో నీటి లభ్యత మెరుగుపడేందుకు ఇటువంటి చర్యలు దోహదపడతాయని స్థానికులు పేర్కొన్నారు.వర్షపు నీటి సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు, ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని, నీటి వనరుల పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా సూచించారు. గ్రామంలో భూగర్భ జలాల పరిరక్షణకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని తెలిపారు.

## ప్రాథమిక పరిషత్ పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**లక్ష్మీదేవి పల్లి, 9అక్టోబర్ ,ప్రజా జ్యోతి:** లక్ష్మీదేవి పల్లి మండలం లోని కారుకొండ పంచాయితీ గౌండ్ల రామవరం మండల ప్రాథమిక పరిషత్ పాఠశాల పాఠశాల యందు ప్రధానోపాధ్యాయురాలు మరియు ఉపాధ్యాయుడు రమేష్ మరియు అంగన్వాడీ టీచర్ ఆధ్వర్యంలో పాఠశాల యందు విద్యార్థు లు ఎంతో ఉత్సాహంగా ఉల్లాసంగా బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు తెలంగాణలో అత్యంత వైభవంగా సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పండుగ బతుకమ్మ పండుగ అని ప్రధానోపాధ్యాయురాలు పేర్కొనడం జరిగింది అదేవిధంగా ఉపాధ్యాయుడు రమేష్ గారు చదువులో కూడా ఇలాగే ఉల్లాసంగా ఉత్సాహంగా ఉండడం మా పాఠశాల విద్యార్థుల ప్రత్యేకత అని ఆనందం వ్యక్తం చేశారు.

## పీఈఎస్ఏ గ్రామసభ ఆమోదంతో ఓసీకి ముందడుగు

- ప్రాంత అభివృద్ధికి, హక్కుదారులకు నష్టం జరగనివ్వం
- ఆర్డీఓ మధు స్పష్టీకరణ అటవీ భూమిపై కీలక తీర్మానం



**ఇల్లందు, అక్టోబర్ 9 (ప్రజాజ్యోతి)** ఇల్లందు ప్రాంత అభివృద్ధికి, భూముల హక్కుదారుల ప్రయోజనాలకు ఎలాంటి నష్టం కలగకుండా నూతన ఓపెన్‌కాస్ట్ గని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్డీఓ మధు స్పష్టం చేశారు. శుక్రవారం మండల పరిధిలోని సిఎస్పీ బస్తీ గ్రామపంచాయతీలో సింగరేణి జవహర్ ఉపరితల గని–2కు సంబంధించిన భూ సమస్యపై నిర్వహించిన పీఈఎస్ఏ గ్రామసభలో కీలక తీర్మానం ఆమోదం పొందింది. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ బొగ్గుకు పుట్టినిల్లైన ఇల్లందు ప్రాంత మనుగడ కొనసాగాలంటే నూతన ఓసీ ఏర్పాటు అవసరమని పేర్కొన్నారు. గని ఏర్పాటుతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. హక్కుదారులకు నష్టం కలగకుండా రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకుంటారని వెల్లడించారు. సింగరేణి ఇల్లందు ఏరియా జీఎం వీసం కృష్ణ మాట్లాడుతూ ఇల్లందు ఏరియాకు పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అటవీ శాఖకు సంబంధించి 168 హెక్టార్ల భూమి అప్పగింతకు గ్రామసభ తీర్మానం చేసినట్లు వెల్లడించారు. పీఈఎస్ఏ చట్టం ప్రాధాన్యం నేపథ్యంలో గ్రామసభలో స్థానిక ప్రజల భాగస్వామ్యం, హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. గ్రామసభ తీర్మానం అనంతరం నూతన ఓసీ ఏర్పాటుకు సంబంధించిన తదుపరి చర్యలపై ఆసక్తి నెలకొంది. సర్పంచ్ లావణ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తహసీల్దార్ ఖాసీం పాషా, ఎంపీడీవో ధన్‌సింగ్, అటవీ శాఖ అధికారి వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి షర్మిల, స్థానిక ప్రజలు, రైతులు, సాగుదారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన

- సెయింట్ మేరీస్ పాఠశాలలో న్యూ స్టార్ ఫౌండేషన్ సేవా కార్యక్రమం





**దమ్మపేట,అక్టోబర్. 09(ప్రజాజ్యోతి):** విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని న్యూ స్టార్ హాస్పిటల్ అధినేత డాక్టర్ సురేష్ రామాల సూచించారు. దమ్మపేట మండలంలోని సెయింట్ మేరీస్ పాఠశాలలో పాస్టర్ రాజారత్నం ఆధ్వర్యంలో సత్తుపల్లికి చెందిన న్యూ స్టార్ ఫౌండేషన్ సహకారంతో విద్యార్థులకు ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్ రామాల మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ఆరోగ్యకరమైన అలవాట్లు అలవరచుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పెద్దలను గౌరవిస్తూ లక్ష్యాలను నిర్దేశించుకొని చదువులో రాణించాలని తెలిపారు.

**విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందులు**

కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందులు, ఐరన్ సిరప్‌లను అందించారు. అనంతరం డాక్టర్ సురేష్ రామాల విద్యార్థులతో కలిసి బతుకమ్మ ఆటల్లో పాల్గొని సందడి చేశారు. ఈ కార్యక్రమంలో న్యూ స్టార్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ భీమిరెడ్డి లహరి, సీఈఓ శిరీష రామాల, మేనేజర్ పాలకొల్లు శ్రీనివాస్, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు న్యూ స్టార్ ఫౌండేషన్ చేపట్టిన కార్యక్రమాన్ని పలువురు అభినందించారు.

**భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు ప్రవర్తించిన తీరు ప్రస్తుతం ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో పెద్ద సవాలుకు దారితీసింది. తన వ్యక్తిగత ఆగ్రహాన్ని పార్టీపై చూపిస్తున్నారనే అభిప్రాయం కూడా పార్టీ వర్గాల్లోకి వచ్చేసింది. నిలకడగా ఒక్క పార్టీలో కూడా ఉండలేని వ్యక్తిగా ఆయనపై ముద్ర పడిందని, ఇప్పటికే దాదాపు నాలుగు నుంచి ఐదు సార్లు పార్టీలు మారిన చరిత్ర ఆయనకు ఉందని అంటున్నారు. బయటకి సీనియర్ నేత అని చెప్పకుంటున్నా, ప్రవర్తన లేదనే టాక్ నియోజకవర్గంలో ఏర్పడింది. ప్రజల ముందే పార్టీ నేతలను విమర్శించడం, పార్టీ ఆదేశాలను పట్టించుకోకపోవడం వెన్నెతో పెట్టిన విద్యలాగా మారిందనే ఆరోపణలు ఏర్పడ్డాయి. తాటి తీరు కారణంగానే పార్టీ శ్రేణులు చెదురు బోదురు అవుతున్నారని, బలహీన వర్గానికి చెందిన నేతపై ఉన్న వ్యక్తిగత విభేదాలను పార్టీపై చూపుతున్నారని చెబుతున్నారు. సీనియర్ గా మార్గనిర్దేశం చేయాల్సింది పోయి వివాదాలకు కేంద్రంగా మారుతున్నారనే విమర్శతో పాటు, ఈ వ్యవహారాలతో కార్యకర్తల్లో కూడా గందరగోళం కూడా నెలకొంది. తదుపరి రాజకీయ అడుగు ఏమిటనేది, ఏ పార్టీలోకి జప్ప అవుతారనేది ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా సంచలనంగా మారింది.**

- గులాబీలోనే ఉంటారా ? పవన్ పార్టీలోకి జంపావుతారా..?
- వాట్సాప్ లో పేరు లేదని.. స్టేజీపై ఇంత రచ్చనా..!
- ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో తెలియదు..!
- ఏ పార్టీలో ఉన్నా అదే తంతు.. అదే వివాదం.. తాటి తీరే అంత..!
- తాటి నుంచి కొత్త రాగం..!



# తాటి నెక్స్ట్ వ్యూహం ఏంటి.?

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి. అక్టోబర్ 9, ప్రజాజ్యోతి...**

మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు తీరు కారణంగా పార్టీ ప్రతిష్ట దెబ్బతింటోందనే అభిప్రాయం బీఆర్ఎస్ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. సీనియర్ నేతగా పార్టీకి దిశానిర్దేశం చేయాల్సిన వ్యక్తి, వరుస వివాదాలకు కారణమవుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. బీఆర్ఎస్ ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉన్నా, చాలా మంది నేతలు, కార్యకర్తలు పార్టీ బలోపేతం కోసం కష్టపడుతుంటే, తాటి వ్యవహారశైలి పార్టీకి ఇబ్బందిగా మారుతోందనే తెలుస్తోంది. నియోజకవర్గంలో తనదైన గ్రూపు రాజకీయాలను ప్రోత్సహించడం, తనకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆరోపించడం, పార్టీ తనను పట్టించుకోవడం లేదని బహిరంగంగా విమర్శలు చేయడం ఆయనకు అలవాటుగా మారిందని సొంత నేతలే చెబుతున్నారు. సీనియర్ ని అవమానిస్తున్నారంటూ బహిరంగం గా ఆగ్రహం వ్యక్తం చేసి రచ్చ చేయడం పరిపాటిగా మారిందనే అభిప్రాయం ఏర్పడింది.

పార్టీలు మారితేనే రాజకీయ భవిష్యత్తు ముగుస్తుందనే విషయాన్ని గ్రహించని తాటి నాయకులను, కార్యకర్తలను ఎలా ఆదుకుంటారని సొంత అనుచరులే ఆవేదన వ్యక్తం చేయడం గమనార్హం.

**వాట్సాప్ లో పేరు లేదని.. స్టేజీపై ఇంత రచ్చనా..**

కొన్ని రోజుల క్రితం కొత్తగూడెంలో జరిగిన బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో తాటి వెంకటేశ్వర్లు వ్యవహరించిన తీరు పార్టీలో హాట్ టాపిక్‌గా మారింది. వాట్సాప్ లో సందేశంలో తన పేరు లేకపోవడం, మరో మాజీ ఎమ్మెల్యేకు ప్రాధాన్యత ఇస్తున్నారనే కారణంతో ఆయన స్టేజీ మీదనే రచ్చతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేగాక పార్టీ నేతలను అందరు చూస్తుండగానే దుమ్మెత్తి పోశారు. స్టేజిపై ఉన్న పెద్ద నేతలు ఎంత సర్ది చెప్పే ప్రయత్నం చేసినా ఆయన గజినీలా వ్యవహారించారని తెలుస్తోంది. కార్యక్రమాన్ని మాటిమాటికి అడ్డుకుంటూ, స్టేజిపై ఎక్కకుండా పార్టీకి రాజీనామా చేస్తానంటూ హెచ్చరించారు. దాదాపు 100 మంది అనుచరులతో సమావేశానికి వస్తే, చివరికి తాటి కేవలం నలుగురితోనే వెనుదిరిగి వెళ్లారని బీఆర్ఎస్ నేతలే వెళ్ళాబుచ్చారు. సమావేశం నుండి బయటకు రాగానే మీడియా ప్రతినిధులకు ఫోన్లు చేసి తన అసంతృప్తినంతా చెప్పుకున్నారు. 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నాయకుడు ఇలా బహిరంగ వేదికపై ప్రవర్తించడం సరికాదని సొంత పార్టీ నేతలే అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

**ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో..!**

రాజకీయాల్లో తాటి వెంకటేశ్వర్లు ప్రస్థానం పార్టీల మార్పులతోనే నిండిపోయిందనే అభిప్రాయం నియోజకవర్గంలో బలంగా ఉంది. 1991లో సీపీఐ తరపున సర్పంచ్ గా గెలిచి రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ఆయన, 1999లో బూర్గంపాడు నుండి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు. ఆ తర్వాత పరిస్థితులు మారడంతో టీడీపీని వదిలి 2014లో వైసీపీ కండువా కప్పుకుని అశ్వారావుపేట నుండి రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. అక్కడ కూడా విభేదాలు రావడంతో 2015లో ఆ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ లో చేరారు. బీఆర్ఎస్ లో తనకు గుర్తింపు లేదంటూ 2022లో కాంగ్రెస్ లోకి వెళ్లారు. 2023 ఎన్నికల్లో అశ్వారావుపేట కాంగ్రెస్ టికెట్ దక్కదని తెలియగానే మళ్లీ బీఆర్ఎస్ గూటికి చేరుకున్నారు. తాజాగా జరిగిన ఎమ్మెల్సీ సన్నాహక సమావేశంలో జరిగిన పరిణామాలను సాకుగా చూపి మళ్లీ బీఆర్ఎస్ కు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆయన ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో తమకే అర్థం కావడం లేదని ఆయన అనుచరులే చెప్పుకునే పరిస్థితి నెలకొందని స్థానికంగా చర్చ జరుగుతోంది.

**ఏ పార్టీలో ఉన్నా ఆగని వివాదం.. తాటి తీరే అంత..!**

రాజకీయాల్లో తాటి వెంకటేశ్వర్లు పేరు ఎక్కడ వినిపించినా అక్కడ వివాదం ఉంటుందనే టాక్ వినపడుతోంది. ఏ పార్టీలో ఉన్నా అధిష్టానాన్ని, సొంత కేడర్ ని ఇబ్బంది పెట్టడమే ఆయన శైలి అనే విమర్శలు చాలా కాలంగా ఉన్నాయి. 2014లో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఓ తహసిల్దార్ పట్ల దురుసుగా వ్యవహరించి పెద్ద దుమారం రేపారు. 2018 ఎన్నికల ప్రచారంలో ఓట్లు అడగడానికి వెళ్లినప్పుడు మహిళలు ఆగ్రహంతో చెప్పులు చూపించి నిరసన తెలిపిన ఘటన కూడా అప్పట్లో సంచలనంగా మారింది. అంతేకాకుండా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తనకంటే జూనియర్ అంటూ, కేటీఆర్, హరీష్ రావు లాంటి నేతలను అహంకారులు అంటూ బహిరంగంగా వ్యాఖ్యలు చేసి పార్టీలో కలకలం రేపారు. ఏ పార్టీలోనూ ఎక్కువ కాలం ఉండరని, పార్టీ మారాలనుకున్న ప్రతిసారీ అధినాయకత్వంపై బురద జల్లి బయటకు రావడం ఆయనకు అలవాటుగా మారిందని స్థానికంగా చర్చ నడుస్తోంది. నియోజకవర్గంలో ఒక వర్గాన్ని అడ్డుపెట్టుకుని పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు చేస్తారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. అవసరాన్ని బట్టి విమర్శించిన వారినే పొగడుతూ రాజకీయంగా లబ్ధి పొందే ప్రయత్నం చేస్తారనే టాక్ అశ్వారావుపేటలో బలంగా ఉంది.

**తాటి నుంచి కొత్త రాగం..!**

ఎన్నికలకు ఇంకా చాలా సమయం ఉన్నప్పటికీ అశ్వారావుపేట నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు మరోసారి పార్టీలో అంతర్గత వివాదానికి కేంద్ర బిందువుగా మారారు. తనకు టికెట్ దక్కే అవకాశాలు తక్కువగా ఉన్నాయని గ్రహించిన ప్రతిసారీ ఇలాంటి వివాదాలను సృష్టించడం ఆయనకు ఆనవాయితీగా మారిందనే చర్చ జోరుగా జరుగుతోంది. గత కొంతకాలంగా ఆయన జనసేన ముఖ్య నేతలతో టచ్ లో ఉన్నారని, ఆ పార్టీ అధిష్టానంతో చర్చలు జరుపుతున్నారనే ప్రచారం బలంగా వినిపిస్తోంది. అందులో భాగంగానే కావాలనే బీఆర్ఎస్ లో అసంతృప్తి రాగం అందుకుంటున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అంతేకాకుండా వచ్చే ఎన్నికల్లో తాను సిట్టింగ్ స్థానమైన అశ్వారావుపేట నుండి కాకుండా, పినపాక నియోజకవర్గం నుండి బరిలోకి దిగాలని భావిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

# నాటుసారా తయారీపై ఎక్సైజ్ ఉక్కుపాదం

- నాలుగు గ్రామాల్లో ఏక కాలంలో దాడులు.. మూడు కేసులు నమోదు
- 800 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం.. ఐదు లీటర్ల నాటుసారా స్వాధీనం



**బూర్గంపహాడ్, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** బూర్గంపహాడ్ మండలంలో నాటుసారా తయారీ, విక్రయాల నియంత్రణే లక్ష్యంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు శుక్రవారం విస్తృతంగా దాడులు నిర్వహించారు.మండలంలోని భాస్కర్‌నగర్,సారపాక,గాంధీనగర్,సంజీవరెడ్డిపాలెం గ్రామాల్లో నాటుసారా తయారీ స్థావరాలపై తనిఖీలు చేపట్టారు.ఈ దాడుల్లో మూడు కేసులు నమోదు చేయడంతో పాటు ఐదు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు.సుమారు 800 లీటర్ల బెల్లం పానకం (వాష్)ను గుర్తించి ధ్వంసం చేశారు.ఖమ్మం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వి. సోమిరెడ్డి,అసిస్టెంట్ కమిషనర్ ఆర్. కిషన్,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎ. శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు ఈ దాడులు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.నాటుసారా తయారీకి ఉపయోగించే బెల్లం పానకాన్ని ధ్వంసం చేయడం ద్వారా అక్రమ తయారీని అడ్డుకునేందుకు చర్యలు చేపట్టారు.

### నాటుసారాతో అనర్థాలపై అవగాహన

దాడుల అనంతరం ఆయా గ్రామాల్లో అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు.నాటుసారా తయారీ,విక్రయాలు,రవాణా వల్ల కలిగే అనర్థాలను వివరించారు.నాటుసారా వినియోగం ఆరోగ్యానికి హానికరమని,అక్రమంగా తయారు చేయడం,విక్రయించడం, రవాణా చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. ఎవరైనా నాటుసారా తయారీకి పాల్పడినా, విక్రయించినా లేదా రవాణా చేసినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ దాడుల్లో భద్రాచలం ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎ. సీతారామరాజు,ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ శ్రీహరిరావు,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి సమీవుల్లా ఖాన్‌తో పాటు ఎక్సైజ్ సిబ్బంది కరీం,సీతారామ్,శ్రావణ్,రాకేష్,రమేష్‌బాబు పాల్గొన్నారు.

# మర్రిగూడెంలో పశువులకు ఉచిత సంతానోత్పత్తి వైద్య శిబిరం

- పశుపోషకులకు ఉచితంగా పశువైద్య సేవలు
- పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



**అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 9, (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల మర్రిగూడెం గ్రామంలో పశువైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గోపాలమిత్ర సేవల సహకారంతో పశువులకు ఉచిత సంతానోత్పత్తి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో పశువులలో సంతానోత్పత్తి సమస్యలు, గొడ్డుబారడం, ఎదకు రాకపోవడం, గర్భధారణలో ఎదురయ్యే సమస్యలకు సంబంధించి పశువైద్య సేవలు అందించారు. పశువుల ఆరోగ్య పరిరక్షణ, పౌష్టికాహారం అందించడం, సకాలంలో వైద్యం చేయించడం, సంతానోత్పత్తి సమస్యలను గుర్తించి నివారించడం వంటి అంశాలపై పశుపోషకులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ చిలకబత్తిని బుచ్చిబాబు పాల్గొని పశువులకు అవసరమైన వైద్య సేవలు అందించారు. గ్రామ సర్పంచ్ కె. సుర్జన, ఉపసర్పంచ్ కటం రాజు శిబిరంలో పాల్గొని సహకరించారు. రైతులు నాగేశ్వరరావు, ఎస్. సోమరాజు, ఎన్. రమేష్ తో పాటు సిబ్బంది బి. కృష్ణ, టి. రవి, బి. నరేష్, ఆర్. చెన్నారావు, భవాని, కె. ప్రసాద్, టి. వెంకటేశ్వర్లు, బి. మధు తదితరులు పాల్గొన్నారు. పశువుల సంతానోత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించడం, పశుపోషకులకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం, పాడి పరిశ్రమ అభివృద్ధికి తోడ్పడటమే ఈ శిబిరం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

# రోడ్డు పనుల్లో జాప్యంపై నిరసన గళం.. పాలకవర్గం, ప్రజల ధర్నా!

- దుమ్ము ధూళితో ప్రజలు, వ్యాపారస్తుల అవస్థలు
- రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని డిమాండ్





**అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 9, (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల సెంట్రల్ లైటింగ్ రోడ్డు పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో ప్రజ లు, వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిపై దుమ్ము ధూళి విపరీతంగా వ్యాపించడంతో నిత్యం రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. రోడ్డు పక్కన వ్యాపారాలు నిర్వహించే వారు దుమ్ము కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, దుకాణాల్లోకి దుమ్ము చేరడంతో వ్యాపార కార్యకలాపాలకు కూడా ఆటంకం కలుగుతోంది. రోడ్డు పనులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొనడంతో ఆగ్రహించిన గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, వ్యాపారస్తులు, గ్రామస్తులు గురువారం ఉదయం అంబేద్కర్ సెంటర్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. రోడ్డు పనులను వెంటనే పూర్తి చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేశారు.ధర్నా విషయం తెలుసుకున్న పోలీసులు అంబేద్కర్ సెంటర్‌కు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. రోడ్డు పనులు నిలిచిపోవడానికి గల కారణాలపై కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ మారగాని అశోక్ కూడా కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి రోడ్డు పనుల్లో జరుగుతున్న జాప్యంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలు, వ్యాపారస్తు లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని పనులను వేగవంతం చేయాలని కోరారు.దీనిపై స్పందించిన కాంట్రాక్టర్ సోమవారం నుంచి రోడ్డు పనులు ప్రారంభించి 15 రోజుల్లో తారు రోడ్డు పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్లు ఉపసర్పంచ్ మారగాని అశోక్ తెలిపారు. అప్పటివరకు ప్రజలకు దు మ్ము ధూళితో ఇబ్బందులు కలగకుండా ప్రతిరోజూ రోడ్డుపై నీళ్లు చల్లిస్తామని కాంట్రాక్టర్ హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ ధర్నాలో గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, వ్యాపారస్తులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొని తమ నిరసన తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు పనులు వెంటనే ప్రారంభించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, ప్రజల ఇబ్బందులను ఇకనైనా తొలగించాలని వారు కోరారు.

# ఆయిల్‌ఫామ్ గెలలకు టన్నుకు రూ.25 వేల ధర కల్పించాలి!

- మంత్రి తుమ్మలకు రైతు సంక్షేమ సంఘం వినతి
- సాగు విస్తరణతోపాటు రైతుల సమస్యలు పరిష్కరించాలి
- ఆయిల్‌ఫెడ్ అధికారులతో సమీక్షలో పాల్గొన్న ఆలపాటి ప్రసాద్



**దమ్మపేట,అక్టోబర్.09(ప్రజాజ్యోతి) :** ఆయిల్‌ఫామ్ రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని తెలంగాణ ఆయిల్‌ఫామ్ రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆలపాటి ప్రసాద్ కోరారు. ఆయిల్‌ఫామ్ గెలల టన్ను ధర కనీసం రూ.25 వేలు ఉండేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో శుక్రవారం మంత్రి సమక్షంలో ఆయిల్ ఫెడ్ అధికారులతో నిర్వహించిన కీలక సమావేశంలో పాల్గొన్న ఆయన.. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తూ వినతి పత్రం అందజేశారు.

### రైతులకు మొక్కల పంపిణీలో ఇబ్బందులు ఉండొద్దు

రాష్ట్రంలో ఆయిల్‌ఫామ్ సాగును విస్తరించి, దేశంలోనే తెలంగాణను అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఆయి ల్‌ఫామ్ సాగు చేపట్టేందుకు ముందుకొస్తున్న రైతులకు నాణ్యమైన మొక్కలను సకాలంలో అందించాలని, మొక్కల పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

### గిట్టుబాటు ధరతోనే రైతులకు ప్రయోజనం





ఆయిల్‌ఫామ్ సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతోపాటు, గెలలకు తగిన ధర లభించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆలపాటి ప్రసాద్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గెలల టన్ను ధర కనీసం రూ.25 వేలు ఉండేలా చర్యలు తీసుకోవాలని, రైతుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం తగిన నిర్ణయాలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరా రు. ఆయిల్‌ఫామ్ సాగు విస్తరణతోపాటు రైతుల సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలని విజ్ఞప్తి చేశారు.

# వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్
- వన్యప్రాణుల సంరక్షణపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు





**దమ్మపేట,అక్టోబర్.09(ప్రజాజ్యోతి) :** జాతీయ వన్యప్రాణి వారోత్సవాలు 2026 సందర్భంగా దమ్మపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 'వన్యప్రాణుల సంరక్షణ–జీవవైవిధ్యం' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అటవీ క్షేత్ర అధికారి (ఎఫ్ఆర్ఓ) శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్ మాట్లాడుతూ అడవులు, వన్యప్రాణుల సంరక్షణతోనే పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందని తెలిపారు. విద్యార్థులు ప్రకృతి పరిరక్షణపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ అడవులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి జయరామ్, అటవీ శాఖ అధికారులు రామారావు, రవి, బేస్‌క్యాంప్ సిబ్బంది రాకేష్, రాంబాబు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మురికి కాలువలోకి దూసుకెళ్లిన ద్విచక్ర వాహనం

- మైనారిటీ కాలేజీ పక్కన ప్రమాదం.. స్వల్ప గాయాలతో బయటపడ్డ కుటుంబ సభ్యులు
- రక్షణ చర్యలు కరువు.. ఆర్ అండ్ బి,పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు




**బూర్గంపహాడ్, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** సారపాకలోని మైనారిటీ కాలేజీ పక్కన ఉన్న మురికి కాలువ ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. కాలువ వద్ద తగిన రక్షణ చర్యలు లేకపోవడంతో ప్రమాదవశాత్తు ఓ ద్విచక్ర వాహనం అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో వాహనంపై ప్రయాణిస్తున్న కుటుంబ సభ్యులు స్వల్ప గాయాలతో బయటపడటంతో పెను ప్రమాదం తప్పింది.కాగా ప్రమాదకరంగా ఉన్న కాలువల వద్ద రక్షణ గోడలు, బారికేడ్లు ఏర్పాటు చేయడంలో పంచాయతీ పాలకులు,అధికారుల నిర్లక్ష్య వైఖరి కనిపిస్తోందని స్థానికులు విమర్శిస్తున్నారు.వివరాల్లోకి వెళ్తే.. రెడ్డిపాలెం నుంచి ఓ వ్యక్తి తన కుటుంబ సభ్యులతో కలిసి వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై సారపాక మసీదు రోడ్డు వైపు వెళ్తున్నాడు.ఈ క్రమంలో సారపాక మైనారిటీ కాలేజీ పక్కకు చేరుకోగానే వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న మురికి కాలువలో పడిపోయింది. ఒక్కసారిగా జరిగిన ఈ ఘటనతో వాహనంపై ఉన్న కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారు.కాగా అదృష్టవశాత్తు స్వల్ప గాయాలతో బయటపడటంతో కుటుంబ సభ్యులతో పాటు స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

### ›› ప్రమాదం జరిగాకే స్పందిస్తారా?

రోడ్ల పక్కన ప్రమాదకరంగా ఉన్న మురికి కాలువల వద్ద రక్షణ గోడలు,బారికేడ్లు హెచ్చరిక సూచికలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాల్సిన బాధ్యత సంబంధిత గ్రామపంచాయతీ అధికారులపై,పాలకులపై ఉంది.ముఖ్యంగా ప్రజలు,వాహనదారులు నిత్యం రాకపోకలు సాగించే ప్రాంతాల్లో కనీస భద్రతా చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ,ఈ విషయంలో నిర్లక్ష్యం ఎందుకు కొనసాగుతోందనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, ఉపసర్పంచ్ ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాల్సి ఉండగా,ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం స్థానికుల ఆందోళనకు కారణమవుతోంది.ప్రజల భద్రతకు సంబంధించిన అంశాలపై అధికారులు,పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే భవిష్యత్తులో మరింత తీవ్రమైన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ›› ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలి

మురికి కాలువల వద్ద ప్రమాదాలు జరగకుండా తక్షణమే రక్షణ గోడలు లేదా బారికేడ్లు ఏర్పాటు చేయాలని,అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.ప్రమాదకర ప్రాంతాలను పరిశీలించి తగిన భద్రతా చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్,ఉపసర్పంచ్‌లను కోరుతున్నారు. మరో ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవించకముందే సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.




# పట్టుకొచ్చి... వదిలేశారా....?

- రెచ్చిపోతున్న ఇసుక, మట్టి మాఫియా!
- అక్రమ రవాణాపై అధికారుల నిర్లక్ష్యమంటూ ఆరోపణలు
- రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని వదిలేశారంటూ విమర్శలు

**ములకలపల్లి అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి):** మండలంలో ఇసుక,మట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మూడు లారీలు, ఆరు ట్రాక్టర్లతో అక్రమ రవాణా సాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. సీతారామ ప్రాజెక్టు కాలువ పరిసరాల్లోని మట్టి కుప్పలతో పాటు, మాధారం అటవీ ప్రాంతంలోని భారీ వృక్షాలను ధ్వంసం చేసి క్వారీలు ఏర్పాటు చేసి మట్టిని లారీల ద్వారా పాల్వంచకు తరలిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరో వైపు వీకే రామవరం శివారులోని ముర్రేడు వాగు నుంచి ఇసుకను ట్రాక్టర్లలో తరలించి, అక్కడి నుంచి లారీల ద్వారా ఇతర ప్రాంతాలకు అక్రమంగా రవాణా చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా ఈ దందా సాగుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### ›› మాయమవుతున్న సీతారామ ప్రాజెక్టు కట్ట!

మండలంలోని మాధారం శివారులో ఉన్న సీతారామ ప్రాజెక్టు కట్ట మట్టి మాఫియా తవ్వకాలతో కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదని విమర్శిస్తున్నారు. భారీ మట్టి గుట్టలు మాయమవుతున్నా సంబంధిత అధికారులకు తెలియకుండా ఉంటుందా అని ప్రశ్నిస్తున్నారు. స్థానిక పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో కుమ్మక్కై ఈ అక్రమ దందా సాగిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. సీతారామ కాలువ పరిసరాల్లో అక్రమ తవ్వకాలు జరిపి కట్టను ఇష్టానుసారంగా తవ్వడం వల్ల దాని భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టి అక్రమ తవ్వకాలు, రవాణాను అడ్డుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### ›› అడవులు ధ్వంసమవుతున్నా పట్టించుకోని అటవీశాఖ!

మాధారం బీట్ పరిధిలోని సీతారామ కాలువ వెంట ఉన్న మట్టి గుట్టలను తరలించిన మట్టి మాఫియా, మరో అడుగు ముందుకేసి అటవీ ప్రాంతంలోని భారీ వృక్షాలను నేలమట్టం చేసి అక్రమంగా క్వారీలు ఏర్పాటు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్కడి నుంచి మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా అటవీశాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అటవీ సంరక్షణలో భాగంగా రాత్రి వేళల్లో గస్తీ నిర్వహిస్తున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు. అటవీ ప్రాంతంలో భారీ స్థాయిలో తవ్వకాలు, వృక్షాల విధ్వంసం జరుగుతున్నా అధికారులకు తెలియకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

### ›› సామాన్యులకు అందని ఇసుక!

వీకే రామవరం శివారులోని ముర్రేడు వాగు నుంచి రాత్రి, పగలు తేడా లేకుండా ట్రాక్టర్లలో ఇసుకను తరలించి, ఒక చోట నిల్వ చేసి, అక్కడి నుంచి లారీల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇంత పెద్ద ఎత్తున ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా పోలీసు, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి, ఇతర చిన్నచిన్న అవసరాలకు ఇసుక తీసుకెళ్తే సామాన్యులపై కేసులు నమోదు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్న అధికారులు, ఇసుక మాఫియాపై మాత్రం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో ములకలపల్లి, జగన్నాథపురం ప్రాంతాల్లో సామాన్యులకు వందల రూపాయలకే అందుబాటులో ఉన్న ఇసుక, ప్రస్తుతం వేల రూపాయలు వెచ్చించినా లభించడం లేదని స్థానికులు వాపోతున్నారు. మరోవైపు ఇసుక మాఫియా సామాన్యుల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తోందని ఆరోపిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టి, సామాన్యులకు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### ›› పట్టుకొచ్చి వదిలేశారా....?

గురువారం రాత్రి అక్రమంగా ముర్రేడు వాగు నుంచి ములకలపల్లి కి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారన్న విషయాన్ని గమనించిన స్థానిక యువకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. యువకుల సమాచారం మేరకు రెండు ట్రాక్టర్ల ను స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకున్నారని సమాచారం. అయితే వాటిపై ఎలాంటి కేసులు నమోదు చేయకుండా శుక్రవారం సాయంత్రం వదిలిపెట్టారనే ఆరోపణలు



స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. ట్రాక్టర్లకు అనుమతులు ఉంటే రాత్రి వేళల్లో ఇసుక తరలించాల్సిన అవసరం ఏమిటని, అక్రమ రవాణా జరుగుతున్నట్లయితే వాహనాలను వదిలిపెట్టడం వెనుక కారణాలేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. తమ అవసరాల కోసం ఇసుక తీసుకెళ్తే సామాన్యులపై కేసులు నమోదు చేసే అధికారులు, ముర్రేడు వాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను వదిలేయడంపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. సామాన్యులకు ఒక న్యాయం, ఇసుక మాఫియాకు మరో న్యాయమా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్, అటవీశాఖ అధికారులు సమన్వయంతో విచారణ చేపట్టి, అక్రమ తవ్వకాలు మరియు రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.ఈ విషయమై స్థానిక ఎస్సై మధుప్రసాద్ ను వివరణ కోరగా పట్టుకున్న ట్రాక్టర్లలో ఇసుక లేదని, ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారన్న అనుమానంతో తహశీల్దార్ కు బైండవర్ చేయడం జరిగిందన్నారు. ఇదిలావుండగా ఇసుకను ఎస్సై ముందే అన్లోడ్ చేసి, కాళీ ట్రాక్టర్లను స్టేషన్ కు తరలించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## దమ్మపేట జెడ్పీహెచ్ఎస్‌లో బతుకమ్మ సంబరాలు

- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ



**దమ్మపేట, అక్టోబరు 9(ప్రజాజ్యోతి ):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే బతుకమ్మ వేడుకలను దమ్మపేటలోని పీఎం శ్రీ జెడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ బద్ధంగా వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మ పాటలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతితో ముడిపడిన జీవన విధానానికి బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి. ఉషారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో గ్రామ సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, ఏఎంసీ చైర్పర్సన్ శ్రీలత పాల్గొన్నారు. ఉపాధ్యాయులు కొండపల్లి కొండలరావు, అత్తిలి శ్రీనివాసరావు, రాంబాబు విద్యార్థులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంపొందించడంతోపాటు పండుగల విశిష్టతను భావితరాలకు అందించవచ్చని తెలిపారు.

## ఆదివాసీ హక్కుల పరిరక్షణకు ఉద్యమిస్తాం

- ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కోశాధికారి కొర్సా వెంకటేష్ దొర



**దమ్మపేట,అక్టోబర్.09(ప్రజాజ్యోతి):** ఆదివాసీ హక్కులు, చట్టాలను పరిరక్షించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కోశాధికారి కొర్సా వెంకటేష్ దొర డిమాండ్ చేశారు. దమ్మపేట మండలం సుధాపల్లి గ్రామంలో నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవో నంబర్ 3 స్థానంలో కొత్త జీవో తీసుకురావాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో 100 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. ఆదివాసీల హక్కుల పరిరక్షణకు ఉద్దేశించిన 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని పేర్కొన్నారు. ఈ చట్టానికి వ్యతిరేకంగా గిరిజనేతరులు సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ ను ఉపసంహరించుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఆదివాసీ విద్యార్థి సంక్షేమ పరిషత్ జిల్లా నాయకుడు కుంజా చిన్నబాబు, గ్రామ పెద్దలు మొగిలి కృష్ణ, వెలకం బాబురావు, కూరం వెంకటేశ్వరరావు, కూరం ప్రసాద్, కొర్సా వెంకటేశ్వరరావు, సోడెం వెంకటేశ్వరరావు, ఇరపా వీరస్వామి, కల్లూరు సీతమ్మ, వెలకం అంజిబాబు, మొగిలి నరేందర్, కూరం రమేష్, కొర్సా పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

- ఐదు నియోజక వర్గాల్లో ఏకంగా 1.32 లక్షల ఓట్ల తొలగింపు..
- సుమారు 2.40 లక్షల మందికి నోటీసులు
- వలసలు, గైర్హాజరు పేరిట భారీ కోత..
- అర్హులైన ఓటర్ల పరిస్థితిపై రాజకీయ దుమారం..




# భద్రాద్రి ఓటర్ల జాబితాలో 'లక్ష'ణమైన షాక్!

## వెల్లువెత్తుతున్న కొత్త దరఖాస్తులు, అనుమానాలు..

మరోవైపు జాబితా సవరణ వేళ కొత్త నమోదులు, మార్పుల కోసం దరఖాస్తులు పోటెత్తాయి. కొత్త నమోదుల కోసం ఫారం-6 కింద 6,350, తొలగింపులపై అభ్యంతరాలకు ఫారం-7 కింద 321, సవరణల కోసం ఫారం-8 కింద 10,921 చొప్పున అప్లికేషన్లు అందాయి. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు ఉందో లేదో భారత ఎన్నికల సంఘం పోర్టల్ (voters.eci.gov.in) లేదా 'ఓటర్ హెల్ప్ లైన్' యాప్ (Voter Help-line App) ద్వారా గానీ, 1950 టోల్ ఫ్రీ నంబర్ కు కాల్ చేసి గానీ వెంటనే ఉచితంగా సరిచూసుకోవాలి. ఒకవేళ పొరపాటున ఓటు తొలగించబడినా లేదా నోటీసు అందినా.. తక్షణమే పరిధిలోని బిఎల్ఓ లేదా తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించి ఫారం-6 ద్వారా మళ్లీ నమోదు చేసుకోవాలని అధికారులు, ప్రతినిధులు సూచిస్తున్నారు. అయితే కనీసం ఇందులోనైన ఒక్క అర్హులైన పౌరుడి ఓటు హక్కు కూడా దుర్వినియోగం కాకుండా, నియోజకవర్గాల వారీగా పూర్తి పారదర్శకతతో అధికారులు వివరణ ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, అక్టోబర్ 9, ప్రజాజ్యోతి ;**
ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఓటు హక్కుపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తీవ్ర కల్లోలం రేగుతోంది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా అధికారులు చేపట్టిన ప్రక్షాళన చర్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో, ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏకంగా 1,32,785 ఓట్లను తొలగించగా, ఏకంగా 2,40,438 మందికి నోటీసులు జారీ చేయడమే ఇందుకు ప్రధాన కారణం.

ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభానికి ముందు జిల్లాలో మొత్తం 9,96,198 మంది ఓటర్లు ఉండగా, ముసాయిదా జాబితా నాటికి ఈ సంఖ్య 8,63,413 కు పడిపోయింది. అంటే జిల్లా వ్యాప్తంగా దాదాపు 13.3% ఓట్లు రద్దయ్యాయి.

నియోజకవర్గాల వారీగా చూస్తే కొత్తగూడెంలో అత్యధికంగా 34,446, ఇల్లందులో 33,351, పినపాకలో 29,664, భద్రాచలంలో 19,873, అశ్వారావుపేటలో 15,451 ఓట్ల చొప్పున తీసివేశారు.

**1.78 లక్షల మంది అర్హులు.. విచారణలో మరో 61 వేల ఓట్లు!**

అధికారులు జారీ చేసిన 2.40 లక్షల నోటీసుల్లో 1,78,577 మందికి సంబంధించి పరిశీలన పూర్తయి అర్హులైన ఓటర్లుగా గుర్తించినట్లు సమాచారం. అయితే, మరో 61,861 ఓట్లకు సంబంధించి ఇంకా క్షేత్రస్థాయి విచారణ పురోగతిలోనే ఉంది.

పినపాకలో 18,775, కొత్తగూడెంలో 18,739, అశ్వారావుపేటలో 10,216, ఇల్లందులో 7,622, భద్రాచలంలో 6,509 ఓట్లు విచారణ దశలోనే ఉన్నాయి. ఈ విచారణలు పూర్తి కాకముందే తుది జాబితాలు ప్రకటిస్తే వేలాది మంది ఓటర్లు తమ హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.

**తొలగింపు కారణాలు.. రాజకీయ వర్గాల్లో అనుమానాలు**

(ఏఎస్‌డీడీ) ఆబ్సెంటీ, షిఫ్టెడ్, డెడ్, డూప్లికేట్ వర్గీకరణ ప్రకారం..తొలగించిన 1.32 లక్షల ఓట్లలో శాశ్వత వలసదారులే 78,253 మంది ఉన్నట్లు చూపారు. మరణించినవారు 31,187 మంది, ఇప్పటికే ఇతర ప్రాంతాల్లో నమోదైనవారు (డూప్లికేట్) 14,305 మంది, గైర్హాజరైనవారు 8,733 మంది, ఇతరులు 307 మంది ఉన్నట్లు పేర్కొన్నారు.

అయితే తాత్కాలికంగా పనుల కోసం బయటి ప్రాంతాలకు వెళ్లిన వారిని కూడా 'శాశ్వత వలసదారుల' కింద జమకట్టేశారా? అని ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో ప్రశ్నిస్తున్నాయి.

బిఎల్ఓలు క్షేత్రస్థాయికి వెళ్లకుండానే విచారణలు ముగించారని, ఆన్‌లైన్‌లో ఈసీఐ పోర్టల్స్ లేదా ఓటర్ హెల్ప్‌లైన్ యాప్‌లలో చూసుకుంటేనే కానీ తమ ఓటు పోయిన విషయం సామాన్యులకు తెలియడం లేదని ఆరోపిస్తున్నాయి. జారీ చేసిన 2.40 లక్షల నోటీసులలో ఎందరి నుంచి స్పందన వచ్చింది? ఎన్నింటిపై క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష విచారణ నిర్వహించారనే వివరాలపై ఎన్నికల అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది

**పట్టిక 2: నియోజకవర్గాల వారీగా ఎస్ఐఆర్ ఫలితాలు, నోటీసులు, విచారణ స్థితి**

| నియోజకవర్గం | ఎస్ఐఆర్‌కు ముందు | ముసాయిదా తర్వాత | తొలగించిన ఓట్లు | జారీ చేసిన నోటీసులు | అర్హులుగా తేలినవి | విచారణలో ఉన్నవి |
|---|---|---|---|---|---|---|
| పినపాక | 2,04,518 | 1,74,854 | 29,664 | 56,091 | 37,316 | 18,775 |
| ఇల్లందు | 2,28,211 | 1,94,860 | 33,351 | 43,317 | 35,695 | 7,622 |
| కొత్తగూడెం | 2,50,085 | 2,15,639 | 34,446 | 70,174 | 51,435 | 18,739 |
| అశ్వారావుపేట | 1,60,221 | 1,44,770 | 15,451 | 36,354 | 26,138 | 10,216 |
| భద్రాచలం | 1,53,163 | 1,33,290 | 19,873 | 34,502 | 27,993 | 6,509 |
| మొత్తం | 9,96,198 | 8,63,413 | 1,32,785 | 2,40,438 | 1,78,577 | 61,861 |

**పట్టిక 2: ఓట్ల తొలగింపు కారణాలు (ఏఎస్‌డీడీ), అందిన దరఖాస్తుల వివరాలు**

| నియోజకవర్గం | మరణించినవారు | శాశ్వత వలస | డూప్లికేట్ ఓట్లు | గైర్హాజరు / ఇతరులు | ఫారం-6 (కొత్తవి) | ఫారం-7 (అభ్యంతరాలు) | ఫారం-8 (సవరణలు) |
|---|---|---|---|---|---|---|---|
| పినపాక | 6,350 | 18,873 | 2,582 | 1,859 | 1,279 | 38 | 2,335 |
| ఇల్లందు | 10,100 | 17,763 | 4,504 | 984 | 1,053 | 15 | 1,924 |
| కొత్తగూడెం | 6,487 | 19,366 | 4,080 | 4,513 | 1,780 | 45 | 4,243 |
| అశ్వారావుపేట | 4,140 | 8,994 | 1,523 | 794 | 1,008 | 35 | 1,148 |
| భద్రాచలం | 4,110 | 13,257 | 1,616 | 890 | 1,230 | 188 | 1,271 |
| మొత్తం | 31,187 | 78,253 | 14,305 | 9,040 | 6,350 | 321 | 10,921 |